క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గుడివాడరూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 15మంది బాధిత కుటుంబాలకు రూ.12లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కూటమి నాయకులు శనివారం అందజేశారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు రామకృష్ణ, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గుడివాడ టౌన్ : విద్యార్థి దశ నుంచే అవినీతి నిరోధంపై అవగాహన ఉండాలని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ రీజినల్ మేనేజర్ సీహెచ్ రాజేష్ అన్నారు. శనివారం స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో విజిలెన్స్–మన ఉమ్మడి బాధ్యత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలలో సంజన, అర్చన, ఆస్మా, సుబ్రహ్మణ్యం, రమ్య, ప్రసన్నలు బహుమతులు గెలుచుకున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.

పదిలో నూరుశాతం ఫలితాలు సాధించాలి



పమిడిముక్కల: పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని అంగలూరు ప్రభుత్వ డైట్ లెక్చరర్ చండిక వేణుగోపాలరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని చోరగుడి హైస్కూల్ కాంప్లెక్స్, ఐనపూరు హైస్కూళ్లను శుక్రవారం ఆయన శనివారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పర్యవేక్షించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం చోరగుడి హైస్కూల్ కాంప్లెక్స్‌ను సందర్శించి, సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. హెచ్ఎంలు సంధ్యారాణి, వేణు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో చింతపాడు విద్యార్థి ప్రతిభ



మండవల్లి: ఈ నెల 17న గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లాల వాలీబాల్ పోటీల విభాగంలో చింతపాడు హైస్కూల్ విద్యార్థి జయమంగళ నాగమణికంఠ (9వ తరగతి) ప్రతిభ కనబరచి ఎంపికైనట్లు హెచ్ఎం భలే భాగ్యలక్ష్మి శనివారం తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పేరెంట్ కమిటీ చైర్‌పర్సన్ ముంగర రజనీ విద్యార్థులను, పీడీ నాగరాజును అభినందించారు.

పామర్రు సీఐకి నగదు బహుమతి



పామర్రు: పామర్రు సీఐ సుభాకర్‌కు నగదు బహుమతిని గుడివాడ డీఎస్పీ వి ధీరజ్ వినీల్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 సంవత్సరంలో పామర్రు మండలం ఉండ్రపూడిలో డబ్బులు ఇవ్వలేదని మురారి దామోదర్‌ను కొట్టి హత్య చేసిన జార్ఖండ్‌కు చెందిన సింగరాయ్ షిండేపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్షను న్యాయమూర్తి విధించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అరెస్టు చేసి జైలు శిక్ష పడే విధంగా విధులు నిర్వహించిన సీఐని డీఎస్పీ అభినందించారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

టపాసుల వ్యాపారులకు వర్షం దెబ్బ

కైకలూరు నియోజకవర్గంలో 39 బాణసంచా దుకాణాలు



కైకలూరులోని బాణసంచా దుకాణాల ఆవరణలోకి చేరిన వర్షం నీరు

కైకలూరు: అధిక పెట్టుబడులతో టపాసుల వ్యాపారులు ముందుగుండు సామగ్రిని కొనుగోలు చేశారు. సోమవారం దీపావళి జరగనుండగా మూడు రోజులు ముందుగానే విక్రయాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో శనివారం కైకలూరు నియోజకవర్గంలో భారీ వర్షం కురిసింది. వర్షాలు పడే అవకాశం ఉండటంతో రెయిన్ ప్రూఫ్ డేరాలను వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు. అయినప్పటికీ కైకలూరు వ్యవసాయ మార్కెట్‌లో దుకాణాల ప్రాంతంలో వర్షం నీరు చేరింది. దీంతో వ్యాపారులు ఆ నీటిని బయటకు పంపుతున్నారు. ఆది, సోమవారాల్లో వర్షం కురిస్తే నష్టపోతామని వ్యాపారులు వాపోతున్నారు. కాగా నియోజకవర్గంలోని కైకలూరు పట్టణంలో 11 దుకాణాలు, రూరల్ సర్కిల్ పరిధిలో మరో 28 దుకాణాలు వెరసి 39 దుకాణాల్లో విక్రయాలు నిర్వహిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించండి

టపాసులు కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కైకలూరు ఫైర్ ఆఫీసర్ క్రాంతికుమార్ వివరించారు.

- బిగుతుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి
- పెద్దల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చాలి.
- గుడిసెలు, గడ్డివాములు, పెట్రోల్ బంకులకు దూరంగా టపాసులు కాల్చాలి.
- ప్రమాదవశాత్తు మంటలు ఎవరికైనా అంటుకుంటే మెల్లగా నేలపై పడి దొర్లాలి.
- టపాసులు కాల్చే ముందు రెండు బకెట్ల నీటిని అందుబాటులో ఉంచుకోవాలి.

కూచిపూడి నాట్య పరంపర కొనసాగాలి

కూచిపూడి(మొవ్వ): సమాజం ధర్మ మార్గంలో ముందుకు సాగాలంటే సంప్రదాయ ప్రాచీన కూచిపూడి నాట్య పరంపరను ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందని కేంద్ర సంగీత నాటక అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ సూచించారు. వరల్డ్ కూచిపూడి డే సెలబ్రేషన్స్–2025ను పురస్కరించుకుని సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలో కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో కూచిపూడి నాట్యంపై నాట్యాచార్యులతో శనివారం సెమినార్ నిర్వహించారు. నాట్యాచార్యులు నృత్య రూపకాలు, కాలపం, యక్షగానాలు, నృత్య నాటకాలు, బహురూప వేషాలు, ఏకపాత్ర కేళికలు, వ్యస్త నృత్యాంశాలు, పగటి వేషాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భామాకలాపంలోని సిగ్గయనోయమ్మ అనే అంశానికి వేదాంతం రాధేశ్యామ్ సత్యభామగా నృత్యం చేస్తూ యక్షగాన ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ వ్యవస్థాపకుడు పెదప్రోలు భావన, కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ చింతా రవి బాలకృష్ణ, నాట్యాచార్యులు ఏలేశ్వరపు శ్రీనివాసు, గేడల సాంబశివరావు, వేదాంతం వెంకట దుర్గా భవాని, వేదాంతం వాగ్దేవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చినసత్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కూచిపూడి నాట్యాచార్యులు

7 బాణసంచా దుకాణాలకు అనుమతులు

మండవల్లి: మండలంలో ఏడు బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు తహసీల్దార్ కె.గోపాల్ తెలిపారు. మండవల్లిలో 6, పెరికెగూడెంలో ఒక దుకాణానికి అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. బాణసంచా దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ రామచంద్రరావు పేర్కొన్నారు. ప్రతి దుకాణం వద్ద తప్పనిసరిగా నీటి డ్రమ్ములు, ఇసుక బక్కెట్లు ఉంచుకోవాలన్నారు.

కాలువ తవ్వకం పనులు ప్రారంభం

మండవల్లి: పెరికెగూడెం పరిధిలోని గన్నవరం చానల్ నుంచి కొర్లపాడు మలుపు వరకు పెరికెగూడెం బ్రాంచ్ కాలువ తవ్వకం పనులు శనివారం ప్రారంభించారు. ముదినేపల్లి ఏఈఈ కేవీ సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు కూనపురెడ్డి కోటేశ్వరరావు, పెరికెగూడెం నీటిసంఘం అధ్యక్షుడు ఎలికే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయంలో నిబంధనలు తప్పనిసరి

పామర్రు: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా టపాసులను విక్రయించాలని డెప్యూటీ తహసీల్దార్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక చల్లపల్లి రోడ్డులోని కోటి జగపతి కల్యాణ మండపంలో దుకాణ సముదాయాల ఏర్పాటు స్థలాన్ని శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆది, సోమవారం రెండు రోజులు మాత్రమే టపాసులు అమ్ముకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. అగ్నిమాపక అధికారి రాంబాబు, ఆర్ఐ రాము తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు పాటించండి

పామర్రు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలను పాటించాలని తహసీల్దార్ జీ రవికాంత్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై మిల్లర్లకు, సిబ్బందికి ఒక్కరోజు అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. తేమ శాతంలో తేడాలు లేకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో పౌరసఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్లు ప్రజ్ఞ, భవితవ్య పాల్గొన్నారు.

స్టేషన్ ఆవరణలోని వాహనాలను కోర్టుకు అప్పగించండి

పామర్రు: పామర్రు స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో దొరికిన వాహనాలను వెంటనే కోర్టుకు అప్పగించాలని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. స్థానిక స్టేషన్‌లో శనివారం ఆయన వార్షిక తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకుని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడచుకుని, వారి సమస్యను తగువిధంగా పరిష్కరించేలా చూడాలన్నారు. పామర్రు సీఐ సుభాకర్, ఎస్ఐ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వాయు కాలుష్యాన్ని నివారిద్దాం



గుడివాడలో వాయు కాలుష్య నివారణ ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్



గుడ్లవల్లేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గుడివాడ టౌన్ : వాయు కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ అన్నారు. శనివారం ఎయిర్ పొల్యూషన్ వలన ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి శనివారం కారు ఫ్రీ, బైక్ ఫ్రీ డేగా ప్రకటించారు. ఉద్యోగులు, సిబ్బంది ప్రతి శనివారం సైకిల్ లేదా కాలినడకన కార్యాలయానికి రావాలని ఆయన కోరారు. వాయు కాలుష్యం నివారణకు ప్రతిఒక్కరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రతిఒక్కరూ గ్రామంలో స్వచ్ఛత కోసం పాటుపడదామని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ ప్రతిజ్ఞ చేయించారు. గుడ్లవల్లేరులో శనివారం ఈ విషయమై గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గాలిలో కాలుష్యాన్ని తగ్గించాలని ర్యాలీలో నినాదాలు చేశారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పెదపారుపూడి: ప్రతిఒక్కరూ తమ పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు దరి చేరబోవని ఎంపీడీఓ విమాదేవి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలను శుభ్రంగా ఉంచండి

కలిదిండి(కైకలూరు): పంట కాలువల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కలిదిండి డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, ఎంపీడీఓ ఆర్.ఫణింద్ర అన్నారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అమరావతి, సంతోషపురం, భాస్కరరావుపేట కాలువ గట్లపై చెత్త, వ్యర్థాలను జేసీబీతో ట్రాక్టర్‌లో నింపి బయట విడిచిపెట్టారు. తహసీల్దారు రామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ ఫణికుమార్, కలిదిండి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు సూర్యనారాయరాజు, బి.తులసీరావు, వెంకటాచలం, భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చెత్త నిర్మూలన కార్యక్రమంలో డీసీ చైర్మన్, తహసీల్దారు తదితరులు

సోలార్ వినియోగాన్ని ప్రోత్సహిద్దాం

గుడివాడ టౌన్ : సోలార్ పవర్ వినియోగంలోకి సమాజం రావాలని విద్యుత్‌శాఖ డీఈ జీబీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సోలార్ పవర్‌పై అవగాహన కల్పిస్తూ పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యాఘర్ పథకం వలన విద్యుత్ వినియోగం భారం ప్రజలపై తగ్గుతుందన్నారు. ప్రతిఒక్కరూ సాధ్యమైనంత వరకు సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఈ నాగబాపిరాజు, డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సునీత, జీఎస్టీఓ భద్రినాథ్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

గుర్రపుడెక్క ఇలా.. మురుగుపోయేది ఎలా?



దోసపాడు వద్ద జొన్నపాడు మీడియం డ్రెయిన్‌లో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్క

దోసపాడు(పెదపారుపూడి): మండలంలోని దోసపాడు వద్ద ఉన్న జొన్నపాడు మీడియం డ్రెయిన్‌లో గుర్రపు డెక్క దట్టంగా పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గుర్రపు డెక్క నివారణ చర్యలు చేపట్టకపోవటంతో చిన్నపాటి వర్షాలకే డ్రెయిన్ పొంగి వందలాది ఎకరాలు నీట మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన్య వ్యక్తం చేస్తున్నారు. జొన్నపాడు డ్రెయిన్ సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం ఉంటుందని, ఇప్పటికైనా డ్రెయినేజీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

సీహెచ్‌సీ పనులను వేగవంతం చేయండి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు: కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. గ్రామంలో జరుగుతున్న సీహెచ్‌సీ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పామర్రు–విజయవాడ రహదారి పక్కనే సీహెచ్‌సీ ఉండటం వలన అత్యవసర సమయాల్లో వైద్య సేవలను అందించేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మండపాక శంకర్‌బాబు, వెంకటేశ్వరరావు, సందీప్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం దుర్మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న దుక్కిపాటి శశిభూషణ్

గుడివాడరూరల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు దుర్మార్గమని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ పేర్కొన్నారు. మండలంలోని కల్వపూడి అగ్రహారంలో కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యాచరణపై శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు, మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ఆదేశాలతో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేలా కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేయాలని చూస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, జెడ్పీటీసీ సభ్యుడు గొల్ల రామకృష్ణ, పార్టీ నాయకులు ఇమ్మడి అశోక్, గంటా శ్రీనివాసరావు, గంటా సురేష్, ఏలేటి ఆంజనేయులు, మెండా కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

డయాలసిస్ యూనిట్ ప్రారంభం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్ మస్తాన్, ఎన్ఆర్ఐ సీతారాం

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయం ఏడో వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని శనివారం డయాలసిస్ యూనిట్ ప్రారంభించారు. ఈ వైద్యాలయం వ్యవస్థాపకులు డాక్టర్ కూచిబొట్ల ఆనంద్ చొరవతో ఎన్ఆర్ఐ జ్యోతి చింతలపూడి సహకారంతో రూ.7.50 లక్షలతో ఏర్పాటు చేసిన యూనిట్‌ను మండల తహసీల్దార్ కే మస్తాన్, ప్రవాస భారతీయుడు హెడ్ ఆఫ్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ పురాణం సీతారాం (యూఎస్ఏ) ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైద్య సేవలను గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాలయం పరిపాలన అధికారి జొన్నలగడ్డ హనుమకుమార్, ట్రైనీ ఎస్ఐ చంద్రకళ, సహాయ పరిపాలన అధికారి నిమ్మగడ్డ సత్య ప్రకాష్, సలహా మండలి కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వరరావు, వైద్య నిపుణులు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ లిల్లీపాల్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ వసుమర్తి శ్వేతసలహా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



గుడివాడలో ప్రసంగిస్తున్న 11వ అదనపు జిల్లా జడ్జి సుబ్రహ్మణ్యం



భైరవపట్నం సదస్సులో మాట్లాడుతున్న లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ లక్ష్మి

గుడివాడ టౌన్ : ప్రస్తుత సమాజంలో జరుగుచున్న అక్రమాలు, ఇతర ఇబ్బందికర పరిస్థితులలో ప్రతి ఒక్కరూ పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం స్థానిక పాటిమీద గల కాలక్షేప మండపంలో మండల న్యాయసేవాధికార కమిటీ, అంకిత మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల యొక్క ప్రతిచర్యను గుర్తించాలన్నారు. వారిని నిరంతరం పర్యవేక్షించాలని ఈ యాక్ట్ కింద కేసు నమోదైతే శిక్ష అత్యంత కఠినంగా ఉంటుందన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్ నాశనమవుతుందన్నారు. అలాగే మహిళల అక్రమ రవాణా, ప్రతి స్త్రీకి స్వేచ్ఛగా నివసించే హక్కు కలిగి ఉండటం, వేధింపుల బారి నుంచి రక్షించుకోవడం, హెచ్ఐవీ బాధితుల పట్ల దయా దాక్షిణ్యాలు కలిగి ఉండటం వంటి అంశాలపై ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అంకిత సీబీవీ ప్రెసిడెంట్ జి. బేబి సరోజిని, స్వాతి మహిళా సంఘం పీఓ నవీన్, అంకితమేనేజర్ టి.అరుణ్‌కుమార్, న్యాయవాదులు ఆల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

మండవల్లి: భైరవపట్నం సచివాలయం వద్ద ఎంఎల్ఎస్‌సీ, యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, సైబర్ క్రైమ్, బ్యాంకులకు సంబంధించిన కేసులు, పలు చట్టాలపై మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వీవీఎన్వీ లక్ష్మి అవగాహన కల్పించారు. బ్యాంక్ మేనేజర్ డీవీఎస్ లోవ, పానల్ లాయర్లు పి.ప్రసన్నకుమార్, డి.శివప్రసాద్, న్యాయవాదులు సీహెచ్ జయప్రకాష్, సీహెచ్ వెంకటప్పయ్య, అడ్డగర్ల స్వరూప్, డి.మేరీరత్నకుమారి, ఎస్ఐ రామచంద్రరావు, సర్పంచ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెస్ పోటీలకు మాంటిస్సోరి విద్యార్థులు



డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం పద్మావతి



క్రీడా మహోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు



డివిజన్ స్థాయి జట్టుతో పీటర్సన్

గుడివాడ టౌన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న డివిజన్ స్థాయి చెస్ పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ హెచ్ఎం పద్మావతి శనివారం తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి ఎంపిక పోటీల్లో అండర్–17 చెస్ పోటీల్లో తమ విద్యార్థులు జి. బేబి శరణ్య, సీహెచ్ జయప్రకాష్, అండర్–14 విభాగంలో ఎం. ఇందూ వర్షిత డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు జి. శ్రీనివాసరావు, ఎం. సత్యాన్వేష్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించారు.

ఘనంగా క్రీడా మహోత్సవం

ముదినేపల్లి రూరల్: స్థానిక వికాస్ జూనియర్ కళాశాల్లో 2025–26 బ్లాక్‌స్థాయి క్రీడా మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మేరా యువభారత్ టీం సభ్యులు కె ప్రసన్న దత్తా, కె జగదీష్ ఆధ్వర్యంలో జరిగింది. క్రీడామీట్‌ను బీజేపీ మండల అధ్యక్షురాలు నాగలక్ష్మి, కేవీ సుబ్బారావు ప్రారంభించారు. కళాశాల చైర్మన్ టి.మదనకిషోర్, ప్రిన్సిపాల్ ఎ.కిషోర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్, పీఈటీ శివకోటయ్య పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి వాలీబాల్ జట్టుకు పీటర్సన్ ఎంపిక

గుడ్లవల్లేరు: స్థానిక ఏఏఎన్ఎం వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి విద్యార్థి వి.పీటర్సన్ గుడివాడ డివిజన్ స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ఆ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి శనివారం విలేకరులకు తెలిపారు. 2025–26 సంవత్సరం వివిధ క్రీడల్లో జిల్లా జట్ల ఎంపికలో భాగంగా గుడివాడ డివిజన్‌లోని 12 మండలాల విద్యార్థుల నుంచి గుడివాడ డివిజన్ వాలీబాల్ జట్టుకు ఎంపిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని డివిజన్ల నుంచి ఎంపికైన విద్యార్థులలో జిల్లా జట్టును ఈ నెల 21వ తేదీన ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.